క్లుప్తంగా

ఆకట్టుకున్న రచయితల గోష్టి

సీతంపేట : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం కథా రచయితల గోష్టి ఆకట్టుకుంది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మంచి కథ జనుల హృదయాల్లో కలకాలం నిలుస్తుందన్నారు. ద్విభాష్యం రాజేశ్వరరావు, అంగర వెంకట కృష్ణారావు, మల్లా ప్రగడ రామారావు, దాట్ల నారాయణ మూర్తి రాజు, ఇందూ రమణ, గన్నవరపు నరసింహమూర్తి, దామరాజు విశాలాక్షి తదితరులు కథానికలు వివరించి వాటిలోని వివిధ అంశాలను విశ్లేషించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, సాహితీవేత్తలు భాగవతుల సత్యనారాయణమూర్తి, కుప్పిలి భీమేశ్వర రావు, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో జ్ఞానాన్ని సముపార్జించాలి

మురళీనగర్ : గ్రంథాలయాల్లో పఠనం ద్వారా జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.వసంత కుమారి సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతీ ఆదివారం విద్యార్థులు గ్రంథాలయాలకు రావాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. పిల్లలు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ వై.పద్మజ, లెక్చరర్ కృష్ణవేణి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, మాధవధార జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, బాలభాను పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

సీతమ్మధార : రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఎన్నో కష్టాలు భరించి ప్రజలకు, పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి విద్యుత్ అందిస్తున్నారని... వారి సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు గురుద్వారా వద్ద గల ఈపీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరదలు, తుపాన్లు సంభవించేటప్పుడు, వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయినా ఎంతో కష్టపడి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లు పెట్టడంతో అనేకమంది ఉపాధి కోల్పోతున్నారని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, అధ్యక్షుడు కె.సత్యారావు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ కిరణ్‌కి సర్టిఫికెట్ జారీ

సీతమ్మధార : జీవీఎంసీ స్నేక్ క్యాచర్ కిరణ్‌కి సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్ బుధవారం సర్టిఫికెట్ అందజేశారు. జీవీఎంసీ పరిధిలో ఎక్కడ పాములు కనిపించినా కిరణ్ పట్టుకుని అడవుల్లో వదిలేస్తుంటారు. ఇటీవల సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో కోడెనాగు కనిపించడంతో హడలిపోయిన సిబ్బంది కిరణ్‌కి సమాచారం చేరవేయడంతో ఆయన చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్‌కి తహసీల్దార్ ఎం.రమేష్ సర్టిఫికెట్ జారీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గతమంతా ప్రశాంతం.. ప్రస్తుతం భయానకం!

- ఒకప్పుడు మాధవధారలో ఆధ్యాత్మిక పరిమళాలు
- ప్రస్తుతం మద్యం షాపులు, బార్ ఏర్పాటుతో భయాందోళనలు
- వాటిని తొలగించి, ప్రశాంత వాతావరణం కల్పించాలని స్థానికుల డిమాండ్


మాధవధార వైన్‌షాప్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు (ఫైల్)



వైన్‌షాపు ఎదురుగా రోడ్డుపై రద్దీ

మద్దిపాలెం : మాధవ స్వామి ఆలయంతోపాటు ప్రశాంత వాతావరణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ప్రాంతం మాధవధార. స్థానికులు శాంతియుత జీవనం గడిపే ఆ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా మద్యం షాపులు, బార్ ఏర్పాటు చేయడంతో గత వైభవం కనుమరుగైంది. ప్రస్తుతం మందుబాబులు, డ్రగ్స్ తీసుకునే జులాయిలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలో జీవీఎంసీ 51వ వార్డు పరిధిలోని మాధవధార ఎంతో ప్రసిద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడి మాధవ స్వామి ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఎంతో పవిత్రంగా, పుణ్యస్థలిగా భావించే ఈ ప్రాంతం చాలా వేగంగా, సుందరంగా అభివృద్ధి చెందింది.


డ్రగ్స్ ప్రభావంతో అల్లరి పనులు

మద్యం షాపులు, బార్ ఏర్పాటుతో మందుబాబుల ఆగడాలు భరించలేకపోతున్న మాధవధార వాసులకు డ్రగ్స్ తీసుకుంటున్న జులాయిలు పెద్ద తలనొప్పిగా మారారు. ఆకతాయిగా తిరిగే వారు, కళాశాల విద్య మధ్యలోనే ఆపేసిన వారు డ్రగ్స్‌కు బానిసలై చెడు మార్గంలో పయనిస్తున్నారు. వారితోపాటు మంచి విద్యార్థుల భవిష్యత్‌నూ నాశనం చేస్తున్నారని, మత్తులో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవధార జంక్షన్ నుంచి మాధవస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో మామిడితోటలు, నిర్మానుష్య ప్రాంతాలు మందుబాబులు, డ్రగ్స్ తీసుకునే వారికి అడ్డాగా మారాయని... అటు వైపు వెళ్లాలంటే భయమేస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మత్తులో యువత చిత్తవుతున్నా, స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నా వీరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కట్టడి చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి వేళ పోలీసు గస్తీ పెంచితే మత్తుబాబులకు, ఆకతాయిలకు అడ్డుకట్ట వేయొచ్చని భావిస్తున్నారు.

గత వైభవం కోసం ఎదురుచూపులు

''మా మాధవధార గత వైభవాన్ని తిరిగి పొందాలి. శాంతి, ఆధ్యాత్మికతకు ప్రాతినిధ్యం వహించే ప్రాంతంగా మారాలి'' అని స్థానికులు కోరుకుంటున్నారు. మద్యం షాపులు, బార్ వెంటనే తొలగించాలని, డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల సమీపంలో, మాధవస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో అనైతిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. మద్యం షాపులు, బార్ తొలగించాలని నాయకులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని... చివరకు ధర్నాలు చేసినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించి శాంతియుత వాతావరణం కల్పించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని అంటున్నారు.

ఎప్పుడేం జరుగుతుందోనని భయం



మాధవధార జంక్షన్‌లో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న వైన్‌షాప్

మాధవధారతోపాటు పరిసర ప్రాంతాల్లో మద్యం షాపులు, బార్ ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రశాంత వాతావరణం ఒక్కసారిగా చెదిరిపోయిందనే చెప్పుకోవాలి. తెన్నేటినగర్ నగర్ మెయిన్ రోడ్డులో జనావాసాల మధ్యలో బార్ ఏర్పాటుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మాధవధార జంక్షన్ సమీపంలోని బస్టాప్ వద్ద ఓ మద్యం షాపు ఏర్పాటుతో మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయి. కొద్ది రోజుల కిందటే ప్రారంభించిన ఈ మద్యం షాపు పక్క నుంచి రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాప్‌నకు వచ్చే స్కూళ్లు, కళాశాలల విద్యార్థులు మందుబాబులను చూసి హడలిపోతున్నారు. ఇక్కడకు సమీపంలోనే మాధవధార హైస్కూల్‌తోపాటు కొన్ని ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. పిల్లల భవిష్యత్, మానసిక స్థితిపై మందుబాబుల ప్రభావం ఉంటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు పెరిగిపోవడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు నిత్యం భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

రైతుబజారులో ఉల్లి కోసం బారులు


బజార్‌లో బారులు తీరిన వినియోగదారులు

సీతమ్మధార : కార్తీక మాసంలో కూడా ఉల్లిపాయల కోసం వినియోగదారులు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక సీతమ్మధార రైతుబజార్‌కు గత రెండు రోజులుగా ఉల్లిపాయలు రాలేదు. సెలవు తర్వాత బుధవారం తెరిచిన బజారులో ఉల్లిపాయల కోసం వినియోగదారులు క్యూ కట్టడం కనిపించింది. బజారులో ఉల్లిపాయల ధర రూ.52గా వుంది. అయితే కర్నూలు ఉల్లిపాయల జాడే కనిపించడం లేదు. మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి దిగుమతి చేస్తున్నారు. సహజంగా కార్తీకమాసంలో అయ్యప్ప, శివ మాలధారులు అధిక సంఖ్యలో ఉంటారు. అందువల్ల ఉల్లిపాయల వినియోగం తగ్గుతుంది. బుధవారం బజారుకి 150 బస్తాల మేరకు ఉల్లిపాయలు రాగా 9 స్టాళ్లలో మొత్తం విక్రయించేశారు. మరోవైపు ధరలు మాత్రం తగ్గడం లేదని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శానిటరీ సిబ్బందికి దుస్తుల పంపిణీ


దుస్తులు అందుకున్న కార్మికులతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం : ఇటీవల వరదలు సంభవించిన విజయవాడ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ 41వ వార్డు నుంచి వెళ్లి విశేష సేవలందించిన శానిటేషన్ సిబ్బందికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ బుధవారం దుస్తులు అందజేశారు. అనంతరం జ్ఞానాపురంలో గల వార్డు శానిటరీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రజల కోసం తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా సేవలందించడం ఎంతో అభినందనీయమన్నారు. పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, అర్జున్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐదు తులాల బంగారం చోరీ

సీతమ్మధార : నాలుగో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఐదు తులాల బంగారం అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో మేరీ తెడ్సన్ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. ఈ నెల 14న మధురవాడలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి 17న ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వస్తువులు కనిపించలేదు. కిటికీ గ్రిల్స్ తొలగించి ఉండడంతోతోపాటు బీరువాలోని ఐదు తులాల బంగారు ఆభరణాలు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు, క్లూస్ టీం కలిసి సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. క్రైం ఏఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబూరావు సేవలు మరువలేనివి


బాబూరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

మురళీనగర్ : వెటరన్ అథ్లెక్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు దివంగత డాక్టర్ కప్పల బాబూరావు దానగుణశీలుడని అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ అన్నారు. ఇటీవల డాక్టర్ బాబూరావు మృతి చెందిన విషయం తెలిసి నిర్ఘాంత పోయామన్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో బాబూరావు మృతికి సంతాపం తెలుపుతూ బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు బాబూరావు అనేక విధాలుగా సాయమందించారని గుర్తు చేసుకున్నారు. ముందుగా బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన కోశాధికారి ఎం.రామారావు, పీఆర్‌వో సీహెచ్ వంశీ, సోములు, కోదండ రామలక్ష్మి, విజయలక్ష్మి, ఎం.కొండ, సూరిబాబు, డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గాయనీమణులకు సత్కారం


సత్కారం పొందిన గాయనీమణులతో జీఎస్ఎన్ రాజు

సీతంపేట : గాయనీమణుల ప్రతిభ గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని స్వరాంజలి స్టూడియోస్‌లో గాయనీమణులు కోమలి, మాధురి, సుజాతతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ శ్రావ్యమైన గీతాలతో అలరించిన వారిని ప్రశంసించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని మాట్లాడుతూ విశాఖలో కళాకారులకు కొదవ లేదన్నారు. అనంతరం విశ్వప్రసాద్, కోమలి, మనోహర్, మాధురి, సత్య, చంద్రశేఖర్, హర్షప్రియ పాడిన పాటలు అలరించాయి. అనంతరం గాయనీమణులను సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, కొణతాల రాజు, జి.త్యాగరాజన్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

24న శెట్టిబలిజల వన సమారాధన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కోనసీమ శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు

సీతంపేట : అమలాపురంలో సత్తమ్మతల్లి గుడి వద్ద రెండు తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సోదర సోదరీమణుల కార్తీక వన సమారాధన ఈ నెల 24న నిర్వహించనున్నట్లు కోనసీమ శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు చొల్లంగి వెంకటరమణ, గుత్తుల విజయ్‌కుమార్, రాయుడు శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, రెడ్డి భగవాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బీసీ స్టేట్ కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 23న సాయంత్రం బాలయ్యశాస్త్రి లే అవుట్ సమీపంలోని శెట్టిబలిజ భవనం నుంచి వాహనాలతో ర్యాలీగా బయలుదేరుతామన్నారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, రెడ్డి వెంకటేశ్వరరావు, కడలి సుబ్బారావు, ఇల్లా వెంకటేశ్వరరావు, గుత్తుల తులసి, దొమ్మేటి భీమన్న, మట్టపర్తి నాగరాజు, పెచ్చేటి బాబ్జి, చెల్లుబోయిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానివి ప్రజా వ్యతిరేక విధానాలు



రైల్వేస్టేషన్ వద్ద గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

తాటిచెట్లపాలెం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, దీనిపై ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రదర్శన, సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు రవికృష్ణ పిలుపునిచ్చారు. నిరసనకు సంబంధించిన గోడపత్రికను బుధవారం రైల్వేస్టేషన్ ఎదురుగా ఆవిష్కరించారు. అనంతరం రవికృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ సామాన్యులపై భారం మోపుతోందన్నారు. పేదలపై భారం మోపి అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా నవంబరు 26న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే నిరసన ప్రదర్శన నగరంలోని దొండపర్తిలో గల డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందని, అనంతరం సభ నిర్వహిస్తామని తెలిపారు. ఆటో డ్రైవర్లు, ఓనర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు ఎంఏ ఖాన్, సూరిబాబు, ఆనంద్, శివ, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


అన్నదానం చేస్తున్న శ్యామలాదీపిక, ట్రస్టు సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం కూడలిలో వెలసిన లక్ష్మీనారాయణ ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప, శివ, భవానీ, గోవింద మాలధారులకు బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నప్రసాదాలు వడ్డించారు. కార్తీక మాసంలో అన్నసమారాధన ఎంతో పుణ్యమన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్జున్, స్థానిక నాయకులు కోరువాడ చిన్న, ఎస్.కృష్ణ, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, ఎస్.రామారావు, సాయిరామ్ పాల్గొన్నారు.

రేసపువానిపాలెంలో 600 మందికి...

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణి దుర్గా అమ్మవారు ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి మాలధారులకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ నాయకురాలు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో మాలధారులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్ని దానాల్లోనూ అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. ఈ సందర్భంగా 600 మంది మాలధారులకు అన్నదానం చేశారు.

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష


అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగిస్తున్న తాతాజీ స్వామి, మాలధారులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం పోస్టాఫీస్ రోడ్డులో శ్రీమణికంఠ పీఠం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి సన్నిధానం పూజ, అంబలం పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాతాజీ స్వామి ఆధ్వర్యంలో శబరిమాల అయ్యప్పస్వామి సన్నిధానం మాదిరిగా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రత్యేక అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. శబరిమల మాదిరిగానే 18 మెట్లతో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. గురుస్వామి ఉన్నికృష్ణ ఆధ్వర్యంలో మాలధారులు భక్తి గీతాలు ఆలపించారు. చక్రవర్తి స్వామితో భజన, బ్రహ్మశ్రీ మావుడూరు సంపత్‌కుమార్ శర్మ (తంత్రి)తో పూజ నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని తిరువీధుల్లో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో మణికంఠ పీఠం ప్రతినిధులు, గుప్తాజీ, చిన్నా పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : వాడవాడలా దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా సీతమ్మధారలోని నిమిష్ ఎలైట్ అపార్ట్‌మెంట్ ఆవరణలో వెల్ఫేర్ సొసైటీ సహకారంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యదురాజదాస మాట్లాడుతూ కార్తీకమాసం, దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్తీక మాసంలో శ్రీకృష్ణ భగవానుని ఆరాధన ఎంతో మంచిదన్నారు. శ్రీ కృష్ణునికి అన్ని మొక్కలలో పవిత్ర తులసి అటే చాలా ప్రియమైనదని పేర్కొన్నారు. అనంతరం హరినామ సంకీర్తన, హరేకృష్ణ మహామంత్ర జపం, దామోదర హారతి నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.









